ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు


3★

శనివారం 6 ఏప్రిల్ 2024

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

వేసవిలో ఆహార అలవాట్లను మార్చుకోవాలి

6లో..



ముదురుతున్న వర్గపోరు

- బీజేపీ నేతల మధ్య కొరవడిన సమన్వయం
- మండల కమిటీల నియామకంపై గుర్రు
- ఏకపక్షంగానే వేశారంటూ ఆరోపణలు
- పెద్దపల్లిలో వేర్వేరుగా రైతు సత్యాగ్రహ దీక్షలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొంత కాలంగా బీజేపీలో వర్గపోరు ముదురుతోంది. నియోజకవర్గానికి చెందిన నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి తమ ఆధిపత్య పోరును కొనసాగిస్తున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు నలిగిపోతున్నారు. ఫలితంగా పార్టీ బలోపేతం కాకపోవడమే కాకుండా రానున్న పార్లమెంట్ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, మండల అధ్యక్షుల నియామకాలపై ఒక వర్గానికి చెందిన నాయకులు గుర్రుమంటున్నారు. జిల్లా అధ్యక్షుడు ఏకపక్షంగా మండల, పట్టణ అధ్యక్షులను నియమించారని, పార్టీలో ఉన్న నాయకులను సంప్రదించకుండానే ఇష్టారాజ్యంగా అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు నియమించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక వర్గానికి చెందిన వారికే పదవులు అంటగట్టడంపై మండిపడుతున్నారు. మూడు మాసాల క్రితం కూడా పాత అధ్యక్షుడు రావుల రాజేందర్ జిల్లా కమిటీలో అందరిని సంప్రదించకుండానే నియమించడంపై పలువురు నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కమిటీని రాష్ట్ర కమిటీ రద్దు చేసింది. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో గత కొంత కాలంగా బీజేపీకి చెందిన నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఆధిపత్య పోరును సాగిస్తున్నారు. వీరి పోరు వల్ల సామాన్య పార్టీ కార్యకర్తలు నలిగి పోవడమే గాకుండా పార్టీ బలోపేతం కావడం లేదు.

మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామ కృష్ణారెడ్డి ఒక వర్గంగా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ మరో వర్గంగా ఏర్పడ్డారు. ఇరు వర్గాలు ఒకరినొకరు కలుసుకోక పోవడ మే గాకుండా వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. మూడు మాసాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు ఇవ్వగా నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఆయన ప్రచారం చేయలేదని, పార్టీలో అందరినీ కలుపుకొని పోలేదనే విమర్శలు ఎదుర్కొన్నారు. 1999లో ఎన్డీఏ పొత్తులో భాగంగా పెద్దపల్లి స్థానాన్ని అప్పటి టీడీపీ బీజేపీకి కేటాయిం చారు. దీంతో ఇక్కడి గుజ్జుల రామకృష్ణారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన 2004, 2009, 2018లో పెద్దపల్లి నుంచి, 2014లో రామగుండం నుంచి పోటీ చేసి ఓట మి చెందారు. అప్పుడు కూడా ఆయన పార్టీ నాయకులందరినీ కలుపుకుని వెళ్లలేదనే విమ ర్శలు వచ్చాయి. గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్‌లను సమన్వయం చేసేందుకు పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడ లేదు. దీంతో పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ పరంగా తీరని నష్టం వాటిల్లుతున్నదని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

● భగ్గుమంటున్న గుజ్జుల వర్గీయులు..

ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చంద్రుపట్ల సునీల్‌రెడ్డి గురువారం ప్రకటించిన పట్టణ, మండల అధ్యక్షుల జాబితాను చూసి గు జ్జుల వర్గీయులు భగ్గుమంటున్నారు. దుగ్యాల ప్రదీప్ కుమార్ సూచనల మేరకు ఆయన వర్గానికి చెందిన పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా కావేటి రాజ గోపాల్, పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా మేకల శ్రీనివాస్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడిగా కూకట్ల నాగరాజు, మండల అధ్యక్షుడిగా వేల్పుల రాజన్న, ఓదెల మండల అధ్యక్షుడిగా కారెంగుల శ్రీనివాస్, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షుడిగా చిలువేరు సంపత్, ఎలిగేడు మండల అధ్యక్షుడిగా కోదాటి రమణారావు, జూలపల్లి మండల అధ్యక్షుడి గా కొప్పుల మహేష్‌లు నియామకం కావడం గమనార్హం. వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరువర్గాలను సంప్రదించకుండా మండల, పట్టణ అధ్యక్షులను నియమించడంతో ఆ రెండు వర్గాల మధ్య మరింత చిచ్చు రేపినట్లయ్యింది.

ఈ విషయమై రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నామని గుజ్జుల వర్గీయులు తెలిపారు. అలాగే పార్టీ అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం రైతు సత్యాగ్రహ దీక్షను రెండు వర్గాలు వేర్వేరుగా నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ కార్యాలయంలో దుగ్యాల ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించగా, ఈ దీక్షకు జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి హాజరై పాల్గొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ సాయంత్రం హాజరై నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. గుజ్జుల వర్గీయులు ఆయన నివాస గృహం వద్ద దీక్ష చేపట్టారు. ఇరు వర్గాలకు చెందినవారు వేర్వేరుగా దీక్షలు నిర్వహించడం వల్ల పార్టీ కార్యకర్తలు ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకుని పెద్దపల్లిలో వర్గపోరు లేకుండా ఉండేందుకు ఇరు వర్గాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని పార్టీ నాయకులు కోరుతున్నారు.

ముస్లింలకు అండగా కాంగ్రెస్ : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ ముస్లీం మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. స్థానిక ఫైవింక్లయిన్ మదీన మసీదులో శుక్రవారం ఎహెతే హదుల్ ముస్లిం హ్యాండ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ అతిథిగా హాజరయ్యారు. మక్కాన్‌సింగ్‌తో పాటు పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కూడా ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేసిందని, ఇందులో మహిళలకు బస్సు, గ్యాస్ సబ్సిడీ, గృహ జ్యోతి, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు అమలు చేసిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలులోకి వస్తాయని మక్కాన్‌సింగ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న నాయకులు



ఇసుక తరలించే టిప్పర్లను అడ్డుకున్న నాయకులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 5: మండంలోని గట్టేపల్లి మానేరు వాగులో ఇసుక టిప్పర్లను పలువురు నాయకులు అడ్డుకున్నారు. వాగు నుంచి ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని రెండు రోజుల కిందట కూడా వీరు ఆందోళన చేశారు. దాంతో అధికారులు వచ్చి సమస్యలను విన్నారు. ఈ వేసవిలో మానేరులో ఇసుక తవ్వకాలు తరలింపు మూలంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందని వెంటనే తవ్వకాలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం మానేరు వాగులో ఇసుక తవ్వకాలు చేస్తూ ఇసుకను మానేరు ఒడ్డున నిల్వ చేస్తున్నారన్నారు. కొంతమంది నాయకులు మానేరులో వెళ్లిచూడగా ఇసుక తరలింపు కొనసాగుతుందని టిప్పర్లను అడ్డుకున్నారు. శనివారం నుంచి మానేరు వద్దనే నిరాహార దీక్ష చేస్తామని నాయకులు హెచ్చరించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

అంతర్గాం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం, విలేజి అంతర్గాం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో స్థానిక టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గుడుంబా స్థావరాల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పానకం కుండలను ధ్వంసం చేశారు. స్థావరాల్లో పట్టుబడిన ఎనిమిది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ మంగమ్మ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావని, హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, రవీందర్, కానిస్టేబుళ్లు శ్రావణ్, తిరుపతి, రాజ్‌కుమార్, ప్రశాంత్, రమేష్, నవీన్, శ్రీలత పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జూలపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి నవీన్(23) అనే యువకుడు అనారోగ్య కారణంతో చేత ఈనెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజులుగా నవీన్ పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రు ల్లో వైద్యం చేయించుకున్నా అది నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన నవీన్ గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన అతని కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కాంపెల్లి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5: సింగరేణి కార్మికుడు, అమరుడు పుట్ట నారాయణ వర్ధంతి సందర్భంగా పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగుల కు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావు రమేష్, రవి పాల్గొన్నారు.

జయ స్తంభం పునఃప్రతిష్ఠాపన

రామగిరి, ఏప్రిల్ 5: మండలంలోని కల్వచర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం జయస్తంభం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ ఆలయాల ప్రధాన అర్చకుల మంత్రో చ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీటీసీ కొట్టె సందీప్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, మేకల మారుతీ, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు నెలల నుంచి కూలి డబ్బుల చెల్లింపు నిలిపివేత

- ఈజీఎస్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా



ఈజీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ఓదెల, ఏప్రిల్ 5 : ఓదెల మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయం ఎదుట కూలి డబ్బులు చెల్లించాలని ఉపాధి కూలీలు జాబ్ కార్డులతో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు విలేకరులతో మాట్లాడుతూ తాము రెండు నెలల క్రితం ఉపాధి పనులు నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు కూడా డబ్బులు చెల్లించడం లేదని వాపోయారు. ఈ విషయంలో అధికారులకు తెలిపినా కూడా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఎంత పని చేసినా కూడా 170 నుంచి 180 రూపాయల వరకు చెల్లిస్తున్నారని, కనీసం చేసిన పనికి తగ్గ ఫలితం ఇవ్వాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, అలాగే కూరగాయల ధరలు కూడా అధికంగా పెరిగాయని, వీటికి అనుగుణంగా చేసిన ఉపాధి పనికి తగ్గ డబ్బులు చెల్లించాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు 300 రూపాయలు ఎప్పుడు చెల్లిస్తారో కూలీలకు తెలపాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో కూలీలు నిరసన వ్యక్తం చేసి వెనుదిరిగి వెళ్లారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం

- నేడు గోదావరిఖనిలో రైతు నిరసన దీక్ష

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, ఏప్రిల్ 5: అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈశ్వర్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన అల్లకల్లోలంగా ఉందని, వ్యవసాయరంగం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కనీస అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలిస్తుందని విమర్శించారు. నీరులేక పంటలు ఎండిపోతుంటే అవకాశం ఉన్నప్పటికీ పంటలకు నీరు అందించలేకపోతున్నారని ఈశ్వర్ ఆరోపించారు. నీటి అవకాశం ఉన్నా ఎండిపోయే పంటలను చూసి కూడా సాగు నీరు అందించకపోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోలేదని ఈశ్వర్ గుర్తు చేశారు. పెన్షన్‌పై ఆధారపడి జీవించే వారే ఎక్కువ మంది ఉన్నప్పటికీ వారి పట్ల ప్రభుత్వం దయలేకుండా వ్యవహరిస్తున్నదని ఆయన ఆక్షేపించారు. రైతుల రుణాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రుణాలు చెల్లించాలని, పంటలకు నీరు అందించాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు. రైతు బీమా, రైతు బంధు, నిరుద్యోగ భృతి, క్వింటాల్‌కు రూ.500బోనస్ పథకాలన్నింటిని కాంగ్రెస్ అమలు చేయాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గాల్లో శనివారం నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం గోదావరిఖని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రైతు నిరసన దీక్ష చేపడుతున్నట్టు ఈశ్వర్ చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పార్టీ చేపట్టే రైతు దీక్షలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు గోషు ఐలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేష్, అచ్చెవేణు, నూతి తిరుపతి, అడప శ్రీనివాస్, కృష్ణవేణి, కవితసరోజిని పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - బాబు జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళులర్పించిన అధికారులు



కలెక్టరేట్‌లో జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 5 : మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకుని వెళ్లాలని, వారి చరిత్రను, త్యాగాలను మనమంతా తెలుసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మహనీయుల జీవితం నుంచి మనం వారి పనితీరు, వారు దేశం కోసం చేసిన త్యాగాలు తెలుసుకోవడానికి ఇట్టి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. మనదేశం దృఢంగా ఉంటూ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ, అన్ని మతాల, వర్గాల వారు ఇక్కడ ప్రశాంతంగా నివసించే వాతావరణం ఏర్పడడానికి రాజ్యాంగం రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు అని తెలిపారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశ రక్షణశాఖ మంత్రిగా పనిచేశారని, కీలక సమయంలో సరిహద్దులను కాపాడి దేశాన్ని ఒక్కటి చేసిన మహనీయుడని, రాజకీయాల్లో సుదీర్ఘ కాలం రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తి అని కలెక్టర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, రాజకీయ రంగంలో, సామాజికవేత్తగా డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. బాలికల విద్యకు సైతం ఆయన ప్రాధాన్యం కల్పించారని, తన కుమార్తెను ఇండియన్ ఫారిన్ సర్వీస్ వంటి ఉన్నత చదువులు చదివించారని, మహిళలు చదివితే కుటుంబంతో పాటు సమాజాభివృద్ధికి అవకాశం ముంటుందని తెలియజేసిన మహనీయుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం. నాగలేశ్వర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, డీపీవో ఆశాలత, మత్స్యశాఖ అధికార భాస్కర్, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

● వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ సిబ్బంది, కార్మికులు, రైతులు ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

రైతు సత్యాగ్రహ దీక్షలో బీజేపీ నాయకులు చంద్రుపట్ల, గోమాసే



దీక్షలో మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 5 : రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి అధ్యక్షతన పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గానికి చెందిన వారు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు మీసా అర్జున్‌రావు ఆధ్వర్యంలో గుజ్జుల నివాసంలో దీక్ష చేపట్టారు. ప్రదీప్‌రావు వర్గీయులకు గోమసే శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. మిగిలిన పంట పొలాలు ఎండిపోకుండా డి 83, డి 86 కాల్వల ద్వారా మరొక తడి పంటలకు నీరు ఇవ్వాలని, రూ.2లక్షల రుణ మాఫీ, 15వేల రూపాయల రైతు భరోసా, వరికి ఐదు వందల రూపాయల బోనస్ ఇవ్వాలన్నారు. సాగునీరు అందక ఎండిన పంటలకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కలిసి కదులుదాం.. మరోసారి మోదీని గెలిపిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ నినాదమే విధానంగా నూట నలభై కోట్ల భారతీయుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం అనేక అద్భుత విజయాలను సాధించినట్లు గుర్తుచేశారు. ఐదు సంవత్సరాల అయోధ్య రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కాశ్మీర్‌లో శాంతి, అంతరిక్ష అద్భుతాలు, చట్టసభలలో మహిళలకు 32శాతం రిజర్వేషన్ కల్పించడం, డిజిటల్ పేమెంట్లు, కరోనా సమయంలో ప్రపంచానికి ప్రేరణగా ఉండి భారత శక్తిసామర్థ్యాలు చాటుతూ విజయవంతంగా 20 సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ దీక్ష సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిలారపు పర్వతాలు, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, నాయకులు తంగడ రాజేశ్వరరావు, ఠాకూర్ రాంసింగ్, అది కేశవరావు, పెన్నింటి రాజు, సిలివేరు ఓదెలు పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పర్స సమ్మయ్య, ఎండి ఫహీముద్దీన్, రాజం కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కుటుంబ పాలన'

సుల్తానాబాద్, ఏప్రిల్ 5: వివేక్ వెంకటస్వామి కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కుటుంబ పాలన కొనసాగిస్తూ సామాన్య దళితులకు అన్యాయం చేస్తున్నారని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుల్తానాబాద్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను గెలిపించాలని అభ్యర్థించారు. వెంకటస్వామి కుటుంబ సభ్యులు సామాన్య కార్యకర్తలు, నాయకులకు అవకాశాలు లేకుండా టికెట్లు కొనుక్కుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునిల్‌రెడ్డి, శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, చంద్రకళ, మాటూరి లత, గజబీంకార్ పవన్, సదయ్య గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట్ కెనాల్ నుంచి సాగునీటి విడుదల

రామగిరి, ఏప్రిల్ 5: మండలంలోని బేగంపేట్ డీ83 కెనాల్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఎంపీపీ ఆరెల్లి దేవక్క చేతుల మీదుగా సాగు నీటిని శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మైదం భారతి, వరప్రసాద్, మైదం బుచ్చన్న, కొమురయ్యగౌడ్, శ్రీనివాస్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

కోనరావుపేట ఏప్రిల్ 5: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తలుపులు కొడుతూ వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన రాజేష్ బుధవారం అర్ధరాత్రి మామిడిపల్లిలోని పలు దుకాణాల డోర్ కొట్టి భయభ్రాంతులకు గురి చేశాడు. రిఫ్రిజిరేటర్‌లను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో రాజేష్‌ను అరెస్ట్ చేసినట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి కార్మికుడి మృతి

- అనాథలైన ఇద్దరు కుమారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి పూజారి శ్రీనివాస్(30) అను కార్మికుడు వాగులో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య మృతి చెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి పని చేసుకుంటున్నాడు. చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రి డ్జి నిర్మాణంలో తోటి కూలీలతో కలిసి పనికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కూలీలు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే శ్రీనివాస్ నీటిలో మునిగి మృతి చెందాడు. తల్లి, దండ్రిని ఇద్దరిని కోల్పోయిన ఆ ఇద్దరు పిల్లలు అనాధాలుగా మిగిలారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 5: జమ్మికుంట రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 35-40సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. గుర్తు తెలియని రైల్లో నుంచి పడటం వల్లే మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గన్నేరువరం, ఏప్రిల్ 5: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన వేములవాడ స్వప్న(32) అనారోగ్యంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వప్న తల్లి కలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించం

- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదని, మేము మిమ్మల్ని మార్చేస్తామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పిల్లి సుధాకర్ చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుంది. నగరంలోని కోర్టు చౌరస్తాలో స్థానిక నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. సుధాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూలస్థంభాలుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అది నచ్చని మనువాద, మతతత్వ పార్టీలు ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అదే జరిగితే మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోల్పోతామన్నారు. ప్రతీ పౌరుడు ఈ చర్యను ఖండించాలన్నారు. అంబేద్కర్ అందించిన ఓటు హక్కుతో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మాలలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, రాష్ట్ర ప్రధానాకార్యదర్శి మేడి అంజయ్య, కార్యదర్శి గూడ కనకయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ళ వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, కార్పొరేటర్ గంట కళ్యాణి, శ్రీనివాస్, దామెర సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, మహిళ నాయకురాళ్ళు తీట్ల ఈశ్వరి, ఎలుక దేవయ్య, వెన్న రాజు, కె చందరయ్య, మొగురం రమేశ్, ప్రసాద్, రామచంద్రం, సత్యం, పి భూమ య్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అక్కపల్లి గ్రామానికి చెందిన పోతుల గాంధీబాబు, మందాటి సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాంధీబాబు తన బైక్‌పై అక్కపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో ఇటు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న అదే గ్రామవాసి సురేశ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాంధీబాబు రెండు కాళ్లు విరిగిపోయాయి. సురేశ్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బస్టాండ్‌లో మహిళ వద్ద బంగారం చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ ప్రయాణీకురాలి నుంచి శుక్రవారం 15 తులాల బంగారాన్ని దొంగలు అప హరించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్ ప్రాంతానికి చెందిన సురిగి మంగారాణి తన కూతురుతో కలిసి బీర్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి మెట్‌పెల్లికి వెళ్లేందుకు కొత్త బస్టాండ్ చేరుకుని బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మాటల్లోకి దింపి బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు నగలను అపహరించారు. తేరుకున్న మంగారాణి తన బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైందని తెలుసుకుని జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐతో పాటు ఎస్సై తన సిబ్బందితో బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలను పనిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గర్షకుర్తిలో కిడ్నాప్ కలకలం

గంగాధర, ఏప్రిల్ 5: గర్షకుర్తి వాసి కిడ్నాప్‌నకు గురయ్యాడని సోషల్ మీడియాలో వైరల్ కావడం మండలంలో కలకలం రేపింది. కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి అడవి ప్రాంతంలో పడేసినట్లు వీడియోలు వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. గర్షకుర్తికి చెందిన బూత్కురి దావీదు (35) గ్రామంలో సీఏగా పని చేస్తున్నాడు. కాగా మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం నిర్మల్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారి పక్కన అటవీ ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటువైపు నుంచి జగిత్యాల వస్తున్న ఓ ట్రాలీ వాహనం యాజమాని దావీదును గుర్తించి ఎవ్వరని ప్రశ్నించాడు. తమది గంగాధర మండలం గర్షకుర్తి అని తనను కిడ్నాప్ చేశారని దావీదు చెప్పాడు. దావీదును వాహన యాజమాని జగిత్యాలకు తీసుకు వచ్చి అతడి బంధువులకు సమాచారం అందించాడు. ప్రస్తుతం దావీదు అతని బావ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై కిరణ్ రెడ్డిని వివరణ కోరగా గర్షకుర్తిలోని దావీదు ఇంటికి పంపించి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కిడ్నాప్‌కు గురైనట్లు దావీదు చెప్పుతున్న వీడియోలు వాట్సప్‌లో వైరల్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన జగిత్యాలలోని అతని బావ వద్ద ఉన్నాడని వివరించారు. అసలు కిడ్నాప్‌నకు గురైయ్యాడా, లేక ఏమైందనే విషయంపై ఆరాతీస్తున్నామని, అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



తిమ్మాపూర్‌లో జేఈఈ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్5: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. అభ్యర్థులను పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే జరిగాయి. మొదటి షిఫ్టులో 678 మందికి 612 మంది, రెండో షిఫ్టులో 677 మందికి 620 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న దీప్‌దాస్‌మున్షీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి సమక్షంలో, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీ హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, బీసీ సంఘం నేత బూస అంజయ్య యాదవ్‌ను పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు, దేశ సమైక్యత కోసం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌పార్టీలో చేరానని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరి విష్ణునాథ్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర ఓబీసీ సెల్ సమన్వయకర్త బద్దికుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇరుకుల్లలో అగ్నిప్రమాదం

- కాలిన సపోటా చెట్లు
- రూ. 20 లక్షల మేర నష్టం అంచనా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి చెందిన సపోటా తోటలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. అక్కడ ఉన్న వాచ్‌మన్ భోజనానికి వెళ్లిన సమయంలో మంటలు అంటుకుని చెట్లు దగ్ధమయ్యాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో సపోటా తోటలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకవచ్చామని తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నామని అన్నారు. సపోటా చెట్లకు మంటలు అంటుకోవటంతో చెట్లు భారీగానే కాలిపోయాయని తెలిపారు. సుమారు 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. సుమారు 10 ఎకరాలలో సపోటా చెట్లు ఉన్నట్లు తెలిపారు.

● వస్త్ర దుకాణంలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ టవర్ ప్రాంతంలోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం 5 గంట ల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. భువన కిడ్స్ షాపులో మంటలు అంటుకోవటంతో స్థానికులు కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు అంటుకున్నాయని, ఈ ప్రమాదంలో కొన్ని దుస్తుల, బ్యాంగిల్స్ కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సంఘటనపై విచారణ జరుపుతున్నామని అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో రోడ్డు పక్కన మంటలు అంటుకున్నాయని వచ్చిన సమాచారం మేరకు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.



కాలిపోయిన సపోటా చెట్లు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- బీఎస్పీ సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎం బాలయ్య



మాట్లాడుతున్న ఎం బాలయ్య

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే బహుజనులు శాశ్వత బానిసలు అవుతారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ ఎం బాలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్ముడుపోని నాయకులు కావాలని అన్నారు. వారు మాత్రమే బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతారని, అందుకే అమ్ముడుపోని నాయకులు, కార్యకర్తలను తయారు చేసుకోవాలన్నారు. కార్యకర్తలే బహుజన ఉద్యమానికి వనరులు ఇస్తారని అన్నారు. కేంద్రంలో అధికారంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పేరిట కార్పొరేట్ కంపెనీల నుంచి వేలకోట్ల రూపాయలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. బహుజన ఉద్యమం ఉన్నత విద్యావంతులకు అర్థం కాకపోవడం బాధాకరమని వాపోయారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే బీసీలు బానిసలు కారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. తెలంగాణలో కరీంనగర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఎన్నో ఉద్యమాలు పుట్టాయని, అందులో జగిత్యాల జైత్రయాత్ర, సాయుధ రైతాంగ పోరాటాలు ఇక్కడే పురుడు పోసుకున్నాయన్నారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఒక్కటే అని అన్నారు. కాంగ్రెస్ వారు లౌకిక వాదులు కానేకారని అన్నారు. బీఎస్పీకి తప్ప ఇతర పార్టీకి ఓటేసినా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వండి మేము రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బాహాటంగా మాట్లాడుతున్నారన్నారు. బహుశా ఇవే చివరి ఎన్నికలేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జీ అంకని భాను, నిషాని రామచంద్రం, పుప్పాల లింబాద్రి, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, దొడ్డె సమ్మయ్య, రంగు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, జగిత్యాల ఇన్‌చార్జి చిర్ర శంకర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యాదాసి రవీందర్, పెద్దపల్లి ఇన్‌చార్జి వరికిళ్ళ మల్లేశ్, బాలకల్యాణ్, జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి చాకలి రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

- 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం



ముత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిరిపురం ముత్తయ్య (58) అనే రైతు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు ముత్తయ్య తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఏడాది కిందట రూ.2 లక్షలు అప్పు చేసి కొడుకు శ్రీనివాస్‌ను బహ్రెయిన్ పంపించాడు. మరో రూ.2 లక్షలు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంటి నిర్మాణం అర్థంతరంగా నిలిచిపోయింది. పనులు లభించక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ముత్తయ్యను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కన్నకొడుకు గల్ఫ్ దేశంలో ఉండడంతో భర్తకు భార్య దేవలక్ష్మీ అంతిమ సంస్కారాలు నిర్వహించడం స్థానికులను కంట తడి పెట్టించింది. మృతుడి భార్య దేవలక్ష్మీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన 21 క్వింటాళ్ల గన్‌పౌడర్ పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 5: సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి గ్రామ శివారులో సమాచారం మేరకు ఓ రూంలో అక్రమంగా నిల్వ చేసిన 21.30క్వింటాళ్ల గన్‌పౌడర్‌ను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ హుజూరాబాద్‌కు చెందిన మహేందర్ అనే వ్యక్తి జాగీర్‌పల్లి శివారులోని ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రూంలో గన్‌పౌడర్ దాచాడనే సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. అందులో 142 బాక్సులలో గన్ పౌడర్ ఉందన్నారు. దాని విలువ సుమారు రూ. 74,764 ఉంటుందని వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ గన్ పౌడర్‌ను క్వారీలలో శబ్దం రాకుండా బండ పగుల గొట్టడానికి ఉపయోగిస్తారని, దీన్ని పూర్తి అనుమతులతోనే ఉపయోగించాల్సి ఉంటుదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8న మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కొత్తపల్లిలోగల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిపై ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌లోగల అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పూరించి ఈనెల ఏడో తేదీలోగా కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో సమర్పించాలని కోరారు. ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

సైదాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని గొడిశాల గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తాడూరి రాజకుమార్ అనే రైతు కోతకు వచ్చిన రెండెకరాల మొక్కజొన్న పూర్తిగా కాలిపోయిది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం వేళలో 11కేవీ వైర్ల రాపిడికి నిప్పు రవ్వలు కోతకు వచ్చిన మొక్కజొన్నలో పడడంతో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చుట్టు పక్కల పంటలలోకి వెళ్లకుండా మంటలు ఆర్పారు. మంటలు ఆర్పే క్రమంలో రాజ్‌కుమార్ భార్య స్పృహ తప్పి పడిపోయిందని తెలిపారు. రెండకరాల మొక్కజొన్న దెబ్బతినడంతో తనకు సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చిందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ప్రయివేటు బస్సు ఢీ కొట్టగా తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రామచంద్రపూర్ కాలనీకి చెందిన చిక్యాల సాగర్‌రావు(69) కారులో హుస్నాబాద్ సమీపంలోని ఓ గ్రామంలో ఓ ఫంక్షన్‌కి స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని నుస్తులాపూర్ వద్ద వాహనం నిలిపివేసి వాటర్ బాటిల్ కొనేందుకు స్నేహితులు ముగ్గురితో పాటు సాగర్ రావు రోడ్డు దాటుతున్నాడు. కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు రోడ్డు దాటుతున్న సాగర్‌రావును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలతో సాగర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్‌రావు(భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్‌రావు తపాలా కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ పొందాడు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ ఎస్సై చేరాలు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

దండేపల్లి, ఏప్రిల్ 5 : దండేపల్లి మండల కేంద్రంలోని మల్లన్న గుడిలో, అంబేద్కర్ చౌరస్తాలో ఆటోను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప రాజ్ తెలిపారు. శుక్రవారం గూడెం ఫారెస్టు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య (రేకుర్తి కొత్తపల్లి, కరీంనగర్), పత్తి కనక రాజు (హనుమాన్‌నగర్, కరీంనగర్)లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. నిందితుల నుంచి ఒక ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనంతో పాటు మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



రుషి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 5: తల్లిని కొట్టాను అన్న పశ్చాత్తాపంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన నేరెళ్ల అంజయ్య - లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు నేరెళ్ల రుషి (18) తరచూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చిన రుషిని తల్లి మందలించింది. తండ్రి తాడి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి మంచాన పడగా ఇలా అర్ధరాత్రిలు రావడం ఏంటని ప్రశ్నించింది. తీవ్ర ఆగ్రహానికి లోనై విచక్షణ కోల్పోయిన రుషి తల్లితో పాటు తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రుషి శుక్రవారం తెల్లవారు జామున ఇంటి పైఅంతస్తుకు చేరుకొని తల్లిని కొట్టిన పశ్చాత్తాపంలో మనోవేదనకు లోనై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సవతి తండ్రిని హత్య చేసిన తనయుడు



అంబాదాస్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 5: జల్సాలు మాని పని చేసుకోవాలని మందలించిన సవతి తండ్రిపై కోపం పెంచుకున్న తనయుడు శుక్రవారం హత్య చేశాడు. పోలీసులు, గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ దుర్గమ్మ కాలనీకి చెందిన అంబాదాస్ (54) తన రెండో భార్య భోజమ్మతో పాటు ఆమె కుమారుడు రవితేజతో కలిసి జీవిస్తున్నారు. రవితేజ పని చేయకుండా జల్సాలు చేసుకుంటూ తిరగడంతో అంబాదాస్ మందలించాడు. ఇలా రోజు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి అంబాదాస్‌పై రవితేజ కోపం పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో పడుకొని ఉన్న అంబాదాస్‌పై పదునైన ఆయుధంతో మెడపై కొట్టి పారిపోయాడు. తలపై తీవ్ర గాయం కావడంతో అంబాదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడిఉన్న అంబాదాస్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మె ట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. ఈ మేరకు పరారీలో ఉన్న రవితేజ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో మెట్‌పల్లి వాసి

మెట్‌పల్లి, ఏప్రిల్ 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ సైబర్ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన సేబర్ మోసగాళ్లు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి డిస్కౌంట్ల పేరుతో ఆఫర్ల ఆశ చూపడంతో ఇమ్రాన్ నమ్మాడు. కొంత సమయం తరువాత వారికి ఓటీపీలు చెప్పడంతో కాసేపటికి ఇమ్రాన్ అకౌంట్ నుంచి రూ. 27,440 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తరువాత వారికి ఫోన్ చేస్తే కలవక పోవడంతో మోసపోయినట్లు భావించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాస్ నాయకులు



సెంటినరికాలనీలో పూలమాల వేస్తున్న నాయకులు



జూలపల్లిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 5: బడుగు బలహీన వర్గాల నేత, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని మహనీయుల ఆశయ సాధన సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ ఉన్నందున తమ సంఘం కార్యాలయంలో నిర్వహించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకురి కైలాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర జేఏసీ అధికార ప్రతినిధి ఉస్తాం శ్రీనివాస్ ముదిరాజ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండ్రా శంకర్, ఏఎస్ఎస్ ముఖ్య సలహాదారుడు జనగామ జనార్దన్, జిల్లా కన్వీనర్ పెరక రాజేశం, జిల్లా కోకన్వీనర్ మాచర్ల నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు, కండె కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాస్, రెచవేణి రాజేశం, పట్టణ ఉపాధ్యక్షులు, బాణాల స్వామి, మంతిని వెంకటేష్, కుమ్మరి అంజయ్య, కాదశి లింగమూర్తి, తీర్రి బాలకృష్ణ, వోడ్డపెల్లి ఎల్లేష్, అలవాలా ప్రశాంత్, కళ్లేపల్లి విజయ్ ఈదునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని సుల్తానాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఐబీ చౌరస్తా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు సంకనపల్లి లక్ష్మణ్, న్యాతరి శ్రీనివాస్, చిలుక రాజేశం, నిలారపు రజిత, నాంపల్లి, దేవేందర్, ఎల్ రావు, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, పట్టణ శాఖ అధ్యక్షుడు కాటం సత్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తొట చంద్రయ్య, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, కొట రవీందర్‌రెడ్డి, బండారి సదానందం, ఎల్లె రాంమూర్తి, సిద్దం మురళీ, తులసిరాంగౌడ్, ముచ్చకుర్తి శ్రీనివాస్, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం భారత మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాత్యరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, కాంపల్లి ప్రభాకర్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏఓ ఉమాపతి, ఏపీఎం సుధాకర్, జల్లి రమేష్, కొండయ్య, నారాయణ, చంద్రయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ మొదటి ఉపప్రధానిగా జగ్జీవన్‌రామ్ పేదవర్గాల ప్రజల కోసం కృషి చేశాడని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, మానుమండ్ల సంపత్, భూమయ్య, చంద్రయ్య, అంజయ్య, శ్రీకాంత్, నర్సింహం, రాజయ్య, దుర్గయ్య, నరేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మారం : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సేవాదల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి, నాయకులు దేవి జనార్దన్, కాంపెల్లి రాజేశం, దేవి రాజలింగయ్య, పలకుర్తి రాజే శం, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌లు హాజరై బాబు జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన మార్గం ఎప్పటికీ ఆచరణీయమన్నారు. కులరహిత సమాజం కోసం బాబూ జగ్జీవన్‌రాం ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఎంపీటీసీ రావి సదానందం, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జూపాక ఉమామహేశ్వర్, పాల రాజేశం, ఆయా పార్టీల నాయకులు ఎండీ మునీర్, మాదాసి సతీష్, అంబాల రాజేందర్, ఆడెపు రాజు, ఓదెల రవి, సబ్బని రాజమల్లు, అల్లం దేవేందర్, సొన్నాయిటెంకం శివరామకృష్ణ, రణవేన క్రాంతి, రామస్వామి, సురేష్, శివప్రసాద్, జగన్ సురేష్ గోవర్ధన్, రాములు పాల్గొన్నారు.

ఓదెల : మండల కేంద్రంతో పాటు కొలనూర్‌లో అలాగే వివిధ గ్రామాలలో శుక్రవారం భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బైరి రవీందర్‌గౌడ్, మాటూరి రత్నం, దొడ్డె శంకర్, గుండేటి ఐలయ్య యాదవ్, మాటూరు వెంకటస్వామి, కొల్లూరి రాజేశం, సాత్తూరి అనిల్, తుమ్మల బాపు, కొమురయ్య, కర్ర లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్ రెడ్డి, కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని : దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దళిత సమాజాభివృద్ధికోసం వారు చేసిన సేవలు గొప్పవని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి కొనియాడారు. జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక వన్‌టౌన్ సమీపంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సంద్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ జగ్జీవన్‌రాం ఆల్ ఇండియా అణగారిన వర్గాల సమాఖ్యను ఏర్పాటుచేసి దళిత బహుజనవర్గాలను జాతీయస్థాయిలో ఐక్యపరిచే కార్యాచరణకు ఉద్యమించారన్నారు. జాతీయ దృక్పథంతో పని చేస్తూనే దళిత బహుజనోద్ధరణకు పూనుకున్న ప్రజ్ఞావంతుడు జగ్జీవన్‌రాం అని, సమాజ మార్పునకు దోహదపడే రాజ్యాంగ మార్గ పద్ధతుల పట్ల బలమైన నమ్మకంతో పనిచేశాడన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, సుల్వ లక్ష్మీ నర్సయ్య, కొండపర్తి సంజీవ్, పెండ్యం సత్యనారాయణ, గోపగాని నవీన్‌గౌడ్, కోమళ్ల మహేష్, సుమంత్, కొమ్మల స్వామి, సంపూర్ణ, బరుపటి నారాయణ, రాకేష్ గౌడ్, నవీన్, హర్ష, నరేందర్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసినా సేవలు మరవలేనివని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. జగ్జీవన్ రామ్ జయింతి సందర్భంగా గోదావరిఖని వన్‌టౌన్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తుందని, కాంగ్రెస్ మీరకుమారికి స్పీకర్ పదవిని అప్పగించారని గుర్తుచేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవినీతిరహిత పాలనను చేస్తున్నట్లు మక్కాన్‌సింగ్ తెలిపారు. రామగుండం అభివృద్ధికి అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ అనీల్ కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్వి, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కాల్వశ్రీరాంపూర్‌లో పూలమాల వేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



కొలనూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ఖనిలో పూలమాల వేస్తున్న కందుల సంధ్యారాణి

జన జాతర సభకు భారీగా తరలిరావాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 5: హైదరాబాద్‌లో తుక్కుగూడ జన జాతర సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. తుక్కుగూడలో అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ అధినేత్రి సోనియాగాంధీ విడుదలచేసిన ఆరు గ్యారెంటీ పథకాలకు ఎంతో ఆదరణ లభించిందని ఆయన తెలిపారు. ప్రజల ఆశీర్వాదంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అదే సెంటిమెంట్‌తో పాంచ్ న్యాయ్‌కు శ్రీకారం చుట్టనుందని ఆయన అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో, జిల్లాలో కార్యకర్తలను సమన్వయం చేసుకొని జనాన్ని సమీకరించే బాధ్యతలను పార్టీ బాధ్యులు స్వీకరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షుడు రాందేని మొగిలి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ రఫియొద్దీన్, ఆశెట్టి శ్రీనివాస్, సీపతి సత్యనారాయణ, ఒజ్జల లక్ష్మణ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరందించడంలో బీఆర్‌ఎస్ వైఫల్యం

ధర్మపురి నియోజకవర్గంలో సాగు,తాగు నీరందించడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. గత సెప్టెంబర్, అక్టోబరు మాసంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ఆయన తెలిపారు. వర్షాలు ఆశించినంత రీతిలో కురియలేదని నీటి మట్టం పడిపోయిందని, కాళేశ్వరం కుంగిపోయిందని పేర్కొన్నారు. పంటపొలాలు ఎండిపోవటానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు మరమ్మత్తు పేరట నిధులు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.

సుల్తానాబాద్ మండలంలో వరికోతలు షురూ



కనుకులలో ప్రారంభమైన వరికోతలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 5: సుల్తానాబాద్ మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల కోడ్ వల్ల ప్రజాప్రతినిధులు ప్రమేయం లేకపోవడంతో ఈసారి జిల్లా యంత్రాంగం ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు ఆలస్యం చేయకుండా కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను యంత్రాలతో కటింగ్ చేయిస్తున్నారు. మండలంలోని 27గ్రామాల్లో ఈ యాసంగి పంటకు సంబంధించిన వరి పంటను దాదాపు 23వేల ఎకరాలలో రైతులు సాగు చేశారు. చాలా గ్రామాల్లో వరి పంట కోతకు వచ్చింది. నాలుగైదు రోజుల నుంచి వరి కోత యంత్రాలతో రైతులు కోతలు షురూ చేశారు. అయితే పొలాల్లో కోతలు పూర్తిచేయించిన రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టడం నిబంధనల మేరకు తేమశాతం వచ్చే వరకు వేచిఉండడం, తాలు ఇతర చెత్తాచెదారం లేకుండా చూసుకోవడం వంటి పనులు రైతులకు భారంగా మారాయి. ప్రభుత్వ మద్దతు ధర కోసం ఆశ పడితే ధాన్యం నిల్వ చేయడం, నిబంధనల మేరకు ఎదురుచూడడం వారికి భారం అవుతుందని భావిస్తున్న రైతులు పొలాల నుంచి నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఏ మాత్రం ఆదనపు పనులు లేకుండా వరి కోత యంత్రంతో కోతలు పూర్తి చేయడం ద్వారా ధాన్యం నేరుగా ట్రాక్టర్లలో నింపడం, అక్కడినుంచి ట్రాక్టర్లు ద్వారా సమీప రైస్‌మిల్లుకు తరలిస్తున్నారు. పచ్చి వడ్లు అయినా మిల్లర్లకు ధాన్యం అవసరం కావడంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ. 1950 చొప్పున రైస్‌మిల్లర్లు ధాన్యం కొంటున్నారు. వారం రోజుల వ్యవధిలో చెక్కులు అందిస్తామన్న మిల్లర్ల హామీతో రైతులు ధాన్యం విక్రయిన్నారు.

పోలీసుల పేరుతో ఒంటిపై బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: పోలీసులమంటూ ఒక వృద్ధుడి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరుచుకోమని జాగ్రత్తలు చెప్పి, ఆదమరచి ఉన్న సమయంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటన శుక్రవారం కరీంనగర్‌లో చోటుచేసుకుంది. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న గజవాడ రవీందర్(68) శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సమీపంలోని గీతామందిర్‌కు ఒంటరిగా నడిచి వెళుతుండగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి తాము స్పెషల్‌పోలీసులమంటూ రవీందర్ చేతిలోని బ్యాగ్‌ను చెక్ చేశారు. ఎన్నికల కోడ్ ఉందని, ఇక్కడ దొంగలు బాగా ఉన్నారని, మెడలోని చెయిన్, చేతి ఉంగరాలు తీసి బ్యాగ్‌లో భద్రపరచుకోవాలని సూచించారు. రవీందర్ మెడలోని మూడు తులాల చెయిన్, తులం బరువున్న రెండు ఉంగరాలను తీసి పేపర్ కవర్‌లో పెట్టుకోబోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాల కవర్‌ను జాగ్రత్తగా బ్యాగ్‌లో పెడుతున్నట్లు నటించి మరో కవర్‌ను బ్యాగ్‌లో ఉంచి, బంగారు ఆభరణాల కవర్‌ను ఎత్తుకు పోయారు. కొద్దిసేపటి తరువాత రవీందర్‌కు అనుమానం వచ్చి బ్యాగ్‌లోని కవర్‌ను తెరిచి చూడగా అందులో బంగారానికి బదులు రెండు రాళ్లు కనపడటంతో లబోదిబోమంటూ బాధితుడు తన కుటుంబ సభ్యులకు తెలిపాడు. రవీందర్ కొడుకు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలించగా కనపడలేదు. బాధితుడి కొడుకు వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ జరుపుతున్నారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రేకుర్తిలో పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ ట్రాక్టర్ యజమానులు బత్తిని పర్శరాములు, గుర్రాల చంద్రమౌళిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వేసవిలో ఆహార అలవాట్లను మార్చుకోవాలి

వైద్య అధికారి పద్మజ

రామగిరి, ఏప్రిల్ 5: వేసవిలో ఆహారపు అలవాట్లలో మార్పు ఉండాలని వైద్య అధికారిణి పద్మజ అన్నారు. శుక్రవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో డిప్యూటీ సీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య సంరక్షణపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. వేసవిలో ఆహార పదార్థాల్లో మార్పు చేసుకోవాలని సూచించారు. వేసవిలో ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం జోలికి వెళ్లకపోవడం మంచిదని తెలిపారు. ఆరోగ్య పరమైన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామారావు, ఆసీఫ్ యాసిన్, మురళి, నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కొట రవీందర్‌రెడ్డి, రామిళ్ళ మనోహర్, పోషం, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా సరఫరా

- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి



పైపులైన్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 5: పట్టణ ప్రజలకు ఈ వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు అన్నారు. మండలంలోని గట్టేపల్లి మానేరు వాగులో సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు సరఫరా అయ్యే తాగునీటి పథకం పైపులైన్లు, మోటార్లు, పంప్‌హౌస్‌లను శుక్రవారం చైర్‌పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 5: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి వ్యవసాయ సహకార సంఘం సీఈవో మధు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులకు అనుగుణంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

సుల్తానాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని దుబ్బపల్లి వద్ద రాజీవ్ రహదారి పై ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. కరీంనగర్ నుంచి మంథనికి బయలుదేరిన మంథని డిపోకు చెందిన బస్సు దుబ్బపల్లి వద్దకు రాగానే లారీని తప్పించబోయే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లింది. బస్సులోని ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

నిరుపేదలకు న్యాయవాదుల చేయూత



ముస్లింలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న న్యాయవాదులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఓలసాని రామారావు-స్వరూపారాణి జ్ఞాపకార్థం సీనియర్ న్యాయవాదులు వేల్పుల మురళీధర్‌యాదవ్, మీర్జా సలీంబేగ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని జమా మసీదులో నిరుపేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పులిపాక ప్రవీణ్, దాదాసలాం, నాయకులు మెండే లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి

పాలకుర్తి, ఏప్రిల్ 5: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో శనివారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ జనజాతర సభను విజయవంతం చేయాలని డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు సభకు భారీగా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామశివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాహెర్‌కొండాపూర్‌కు చెందిన కనవేని తిరుపతి(35) దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్న తిరుపతి ఉదయం 11 గంటల సమయంలో ఎలబోతారం లో హార్వెస్టర్ నడిపేందుకు డ్రైవర్‌గా పనికోసం తన బైక్‌పై వెళుతుండగా ఎలబోతారం వద్ద బైక్ అదుపుతప్పటంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై నుంచి ఎగిరి పక్కనే పొలంలో పడిన తిరుపతి ముఖభాగం బురదలో చిక్కుకుంది. అప్పటికే తలకు తీవ్రగాయాలవ టంతో శ్వాస ఆడక మృతి చెందాడు. మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

పెండింగ్ మెస్ ఛార్జీలు విడుదల చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో 17వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్, అభిలాష్, వినయ్, శ్రీజ, పూజ, సందేశ్, రాకేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.